بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 05 June 2026 (Telugu)

## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వినయ, విధేయతల సంఘటనలు, తమ సంస్థకు వినయ, వినమ్రతను అవలంబించాలనే హితబోధ

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 05.06.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ـ
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలా గారి వినయ, వినమ్రతకు సంబంధించిన కొన్ని సంఘటనలు లేదా ఉపదేశాలు వివరించబడ్డాయి. ఈరోజు కూడా అదే విషయానికి సంబంధించి కొన్ని సంఘటనలను వివరిస్తాను.

హజ్రత్ షేక్ ముహమ్మద్ ఇస్మాయిల్ గారు రజియల్లాహు అన్హు ఇలా వివరిస్తున్నారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉత్తమ నడవడిక ఏ విధంగా ఉండేదంటే ఖాదియాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఎల్లప్పుడూ ఆయనకు వ్యతిరేకంగా శత్రుత్వం ప్రదర్శించడంలో నిమగ్నమై ఉండేవారు, ఆయనకు నష్టం కలిగించే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలిపెట్టేవారు కాదు. అయినప్పటికీ వారు ఎప్పుడైనా ఆయన ఇంటి తలుపు తట్టినప్పుడు ఆయన చెప్పులు కూడా లేకుండా బయటకు వచ్చేవారు. వారి సలాంకు సమాధానమిచ్చి, మీరు క్షేమంగా ఉన్నారా? అని వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాల సమాచారాన్ని అడిగి తెలుసుకునేవారు. ఆపై ఏ పని మీద వచ్చారు? అని అడిగేవారు. ఆ తర్వాత వారు తమకు ఉన్న ఏ అవసరాన్ని వ్యక్తపరిచినా మీకు ఎంత అవసరముంది? అని అడిగి వారు అడిగిన దానికంటే ఎక్కువే తెచ్చి ఇచ్చేవారు.

హజ్రత్ మౌల్వీ షేర్ అలీ రజియల్లాహు అన్హు గారు ఒకసారి ఇలా చెప్పారు. మీరాం బఖ్ష్ సౌదాయీ అనే ఒక మానసిక వికలాంగుడు ఉండేవాడు. ఒకసారి ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పెద్ద మసీదు నుండి వస్తుండగా ఆ వ్యక్తి చాలా అనాగరికంగా ఆయనను పిలిచి పైసలు అడిగాడు. ఆయన వెంటనే తన రుమాలు విప్పి, అందులో నుండి నాలుగు లేదా ఎనిమిది అణాలు తీసి అతనికి ఇచ్చారు. అతడు సంతోషంగా వెళ్ళిపోయాడు. మాస్టర్ నజీర్ హుసేన్ గారు ఇలా వివరిస్తున్నారు. నేను ఎప్పుడు నా తండ్రిగారితో కలిసి ఖాదియాన్‌కు హజ్రత్ గారిని దర్శించుకోవడానికి వచ్చినా హకీమ్ మర్హూమె ఈసా గారు వచ్చారని ఆయనకు సమాచారం అందించి నప్పుడు సమాచారం అందిన వెంటనే ఆయన ఎటువంటి ఆలస్యం లేకుండా వెంటనే బయటకు రావడం నేను ఎల్లప్పుడూ చూశాను. అంతేకాక ఆయన స్వయంగా మాకు తినడానికి ఏదో ఒకటి తెచ్చి వడ్డించేవారు. హజ్రత్ గారు అతిథులను ఎంతటి సాధారణంగా కలుసుకునేవారంటే, కొన్నిసార్లు నేను ఆయనను చూసినప్పుడు ఆయన చేతిలో కలం ఉండేది, మరికొన్నిసార్లు ఆయన మమ్మల్ని కలవడానికి చెప్పులు కూడా లేకుండా బయటకు వచ్చేవారు. అంటే ఆయన లోపల ఏ స్థితిలో (ఏలా కూర్చొని) ఉన్నారో, అలాగే బయటకు వచ్చేవారు.

హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిక్ రజియల్లాహు అన్హు గారు ఇలా చెబుతున్నారు: ఒకసారి నేను లాహోర్

నుండి ఖాదియాన్‌కు వచ్చాను. హజ్రత్ గారు నన్ను మస్జిద్ ముబారక్‌లో కూర్చోబెట్టి మీరు ఇక్కడే కూర్చోండి నేను భోజనం తీసుకువస్తానని చెప్పారు. ఆ తర్వాత కొన్ని నిమిషాలకే ఆయన స్వయంగా ఒక పెద్ద పళ్లెంలో భోజనం తీసుకుని వచ్చారు. ఆపై మీరు తినండి, నేను నీళ్లు తీసుకువస్తానని అన్నారు. ముఫ్తీ ఇట్లన్నారు. ఆ మాట వినగానే నా నియంత్రణ లేకుండా నా కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

హజ్రత్ మున్షీ జఫర్ అహ్మద్ కపూర్తల్వీ రజియల్లాహు అన్హు గారు ఇలా వివరిస్తున్నారు. హజ్రత్ గారు ఎప్పుడూ తలుపులు తెరిచి కూర్చునేవారు కాదు, అంటే తలుపులు వేసుకుని లోపల కూర్చునేవారు. ఒకసారి నేను హజ్రత్ గారి వద్ద కూర్చొని ఉన్నాను. ప్రతి కొద్దిసేపటికి హజ్రత్ సాహిబ్జాదా మియాఁ మహ్మూద్ అహ్మద్ గారు వచ్చి అబ్బా! తలుపు తీయండి అని పిలిచేవాడు. ఆయన (హజ్రత్ గారు) వెంటనే లేచి తలుపు తీసేవారు.

మరొకసారి నేను ఆయన సేవలో హాజరైనప్పుడు, హజ్రత్ గారు ఒక చాప మీద కూర్చొని ఉన్నారు. నన్ను చూడగానే ఆయన ఒక మంచాన్ని ఎత్తి లోపలికి తీసుకువెళ్లసాగారు. నేను ఎత్తుతాను అన్నాను. దానికి ఆయన, ఇది చాలా బరువుగా ఉంది, మీ వల్ల కాదని అన్నారు. లోపల మంచం వేసిన తర్వాత మీరు దీనిపై కూర్చోండి, నాకు కిందే హాయిగా ఉంటుంది, నేను కిందే కూర్చుంటానని చెప్పారు. నాకు దాహం వేసినప్పుడు నేను లోపలి నుండి గ్లాసు తెస్తానని చెప్పారు. ఆ తర్వాత లోపలి నుండి రెండు షర్బత్ బాటిళ్లు తీసుకువచ్చారు. వాటిని ఎవరో మణిపూర్ నుండి పంపించారు. ఆయన ఇలా అన్నారు: ఈ సీసాలను ఇక్కడ ఉంచి చాలా రోజులైంది. ఎందుకంటే, మొదట ఎవరైనా స్నేహితుడిని పిలిచి తాగించిన తర్వాతే మేము తాగుతామని భావించి ఉంటిని. తర్వాత నాకు ఒక గ్లాసు షర్బత్ చేసి ఇచ్చారు. నేను మొదట హజ్రత్ గారు ఇందులో నుండి కొద్దిగా త్రాగండి అని అన్నాను. ఆయన ఒక గుటక త్రాగారు. నేను ఆ షర్బత్‌ను ప్రశంసించాను. అప్పుడు ఆయన ఒక సీసా మీరు తీసుకోండి, రెండవ సీసా బయట ఉన్న అతిథులకు తాగించండని చెప్పారు.

ఒకసారి లాహోర్ నుండి కొందరు ప్రముఖులు హజ్రత్ అక్దస్ అలైహిస్సలాతు వస్సలాం గారిని కలవడానికి వచ్చారు. వారిలో డాక్టర్ అల్లామా ఇక్బాల్, సర్ షహాబుద్దీన్ వంటి వారు కూడా ఉన్నారు. ఈ సమావేశం గురించి బాబూ గులామ్ ముహమ్మద్ గారిలా వివరిస్తున్నారు. రాత్రి భోజనం ముగిసిన తర్వాత మంచాలు ఇస్తున్నప్పుడు, నేను ఒక గట్టి, పెద్ద మంచాన్ని తీసుకున్నాను. కానీ చౌదరి షహాబుద్దీన్ గారు నా మంచాన్ని ఆక్రమించుకున్నారు. అంతలో హజ్రత్ గారు అక్కడికి విచ్చేశారు. ఆయన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ మీకు ఎటువంటి ఇబ్బంది లేదు కదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ హజ్రత్! మాకు ఏ ఇబ్బందీ లేదని చెప్పారు. ఆయన నా వద్దకు వచ్చేసరికి నేను దిగులుగా నిలబడి ఉన్నాను. ఎందుకంటే నా మంచాన్ని షహాబుద్దీన్ గారు తీసేసుకున్నారు. నన్ను చూసి ఆయన కాసేపు ఆగు, నేను లోపలి నుండి నీకోసం మంచం తీసుకువస్తానని చెప్పారు. చాలా సేపటి వరకు ఎవరూ రాకపోవడంతో నేను లోపలికి తొంగి చూశాను. అక్కడ ఒక వ్యక్తి ఎంతో వేగంగా మంచం అల్లుతుండటం, హజ్రత్ గారు అతనికి వెలుతురు చూపించడానికి స్వయంగా చేతితో దీపం పట్టుకుని అతని తల వద్ద నిలబడి ఉన్నట్లు నేను చూశాను. హజ్రత్ గారి ఆ స్థితిని చూసి నాకు చాలా సిగ్గుగా అనిపించింది. నేను వెంటనే హుజూర్! ఆ దీపాన్ని నాకు ఇవ్వండి (నేను పట్టుకుంటాను) అని మనవి చేశాను. దానికి హజ్రత్ గారు ఇక ఒక్క వరుస అల్లకం మాత్రమే మిగిలి ఉందని అన్నారు. హజ్రత్ గారి ఈ ఉన్నతమైన నడవడికను చూసి నా మనస్సు ఎంతగానో చలించిపోయింది నా కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీమ్ సియాల్‌కోటీ రజియల్లాహు అన్హు గారు ఇలా వివరిస్తున్నారు: అది బహుశా 1896 నాటి మాట. జూన్ నెల కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. అప్పుడే ఒక ఇల్లు కొత్తగా నిర్మించబడింది. మధ్యాహ్నం సమయంలో అక్కడ ఒక మంచం వేసి ఉండటంతో నేను దానిపై పడుకున్నాను. హజ్రత్ గారు అటు ఇటు తిరుగుతున్నారు. నేను నిద్ర లేచి చూసేసరికి హుజూర్ మంచం కింద నేలపై పడుకుని ఉన్నారు! నేను

అమితమైన గౌరవంతో, కంగారుగా లేచి కూర్చున్నాను. అప్పుడు ఆయన 'ఎందుకు లేచారు?' అని అడిగారు. నేను 'మీరు కింద పడుకుని ఉంటే, నేను పైన ఎలా పడుకోగలను?' అని మనవి చేశాను. దానికి ఆయన చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు. నేను మీ కోసం కావలి (పహరా) కాస్తున్నాను. పిల్లలు గొడవ చేస్తున్నారు, మీ నిద్రకు భంగం కలగకుండా ఉండటానికే నేను వారిని ఆపుతున్నాను.

హజ్రత్ మున్షీ ఇమామ్ దీన్ రజియల్లాహు అన్హు గారు ఇలా వివరిస్తున్నారు: 1894వ సంవత్సరంలో నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి పవిత్ర హస్తాలపై బైఅత్ ప్రమాణం చేశాను. సాయంత్రం నమాజ్ సమయంలో మున్షీ అబ్దుల్ అజీజ్ గారు నా వెంట ఉన్నారు. నమాజ్ ముగిసిన తర్వాత మున్షీ గారు నా వైపు చూపిస్తూ హజ్రత్ అక్దస్ గారి సేవలో హుజూర్! వీరి చేత బైఅత్ తీసుకోండి అని మనవి చేశారు. దానికి హజ్రత్ గారు లోపలికి రండి అని చెప్పారు. నేను ఒంటరిగా లోపలికి బైతుల్ ఫికర్‌లోకి వెళ్లాను. అప్పుడు హజ్రత్ గారు నన్ను మంచం పైభాగం వైపు కూర్చోబెట్టి, తాను స్వయంగా మంచం కాళ్ల వైపు కింది భాగంలో కూర్చున్నారు. హజ్రత్ గారు ఇలా ప్రవచించారు. నా స్థితి ఏ విధంగా ఉంటుందంటే ఒకవేళ ఎవరైనా బాధపడుతుంటే, నేను నమాజ్ చదువుతున్నప్పటికీ ఆ వ్యక్తి రోధన నా చెవిన పడితే, నేను నమాజ్ ఆపి అయినా సరే అతనికి ఏదైనా సహాయం చేయగలిగితే తప్పకుండా సహాయం చేయాలని, సాధ్యమైనంతవరకు అతనిపై సానుభూతి చూపాలని ఆశిస్తాను. తోటి సోదరుడు కష్టంలో లేదా బాధలో ఉన్నప్పుడు అతనికి తోడుగా నిలబడకపోవడం ఉత్తమ నడవడిక కు విరుద్ధం. ఒకవేళ మీరు అతని కోసం ఏమీ చేయలేకపోయినా, కనీసం అతని కొరకు దుఆ అయినా చేయండి. మన వారి సంగతి పక్కన పెడితే, పరాయి వారితో, హిందువులతో కూడా ఇలాంటి ఉన్నతమైన ప్రవర్తననే ఆదర్శంగా చూపాలని, వారితో సానుభూతితో మెలగాలని నేను చెబుతాను. ఎట్టి పరిస్థితుల్లోనూ బాధ్యతారహితమైన స్వభావాన్ని కలిగి ఉండకూడదు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ రజియల్లాహు అన్హు గారు ఇలా అన్నారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఎవరిని కలిసినా ఎంతో చిరునవ్వుతో కలుసుకునేవారు. దానివల్ల అవతలి వ్యక్తి అలసట, బాధలన్నీ పూర్తిగా దూరమైపోయేవి. ఆయన ముఖంలోని ఆ ఆనందాన్ని చూసి ప్రతి అహ్మదీ ఏమని భావించేవాడంటే ఆయన సభలోకి వెళ్ళగానే మనసులోని దుఃఖాలన్నీ కడిగివేయబడతాయని అనుకునేవారు.

సమాజంలో ఎంతటి సామాన్య లేదా పేద వ్యక్తి అయినప్పటికీ, అతని మాటను ఎంతో శ్రద్ధగా వినడం, ఎంతో ప్రేమతో సమాధానం ఇవ్వడం ఆయన అలవాటు. ప్రతి ఒక్కరూ తమకు తామే హజ్రత్ గారికి అందరికంటే నాపైనే ఎక్కువ ప్రేమ ఉందని భావించేలా ఆయన ప్రవర్తన ఉండేది. కొన్నిసార్లు ఆయన సభకు అమాయకపు ప్రజలు కూడా వచ్చి, చాలా సేపటి వరకు తమ సొంత విషయాలను చెప్తూనే ఉండేవారు. అయినప్పటికీ హజ్రత్ గారు ఎంతో ఓపికగా, నిశ్శబ్దంగా వారి మాటలను వినేవారు తప్ప, ఎప్పుడూ ఎవరినీ ఇక చాలు, ఆపండి అని అనేవారు కాదు.

ఒకసారి ఒక వ్యక్తి ఆయన సేవలో హాజరయ్యాడు. అతడు తన తల వంచి ఆయన పాదాలపై పెట్టాలని ప్రయత్నించాడు. అప్పుడు హజ్రత్ గారు తన చేత్తో అతని తలను పక్కకు జరిపి ఇలా వారించారు. ఈ పద్ధతి అనుమతించదగినది కాదు. కేవలం అస్సలాము అలైకుం చెప్పాలి. కరచాలనం చేయవలెను.

ఫకీర్లు మరియు పీఠాధిపతులను అమితంగా ఆరాధించే ఒక వ్యక్తి మా మసీదుకు వచ్చాడు. అక్కడ ప్రజలు ఎంతో స్వేచ్ఛగా మాట్లాడుకోవడం చూసి అతడు ఆశ్చర్యపోయాడు. అతడు హజ్రత్ గారితో ఇలా అన్నాడు. మీ మసీదులో క్రమశిక్షణ లేదు, ప్రజలు మీతో ఎటువంటి సంకోచం లేకుండా ముఖాముఖి మాట్లాడుతున్నారు. దానికి ఆయన (అ) ఇలా సమాధానమిచ్చారు. ప్రజలు క్రూరమృగాన్ని చూసి భయపడినట్లు నా క్షేమాన్ని చూసి భయపడేలా నేను అంతటి కఠిన స్వభావుడిగా, భయంకరుడిగా ఇక్కడ కూర్చోవడం నా సిద్ధాంతం కాదు. నేను ఒక విగ్రహంలా

మారడాన్ని తీవ్రంగా అసహ్యించుకుంటాను. నేను వచ్చింది విగ్రహారాధనను నిర్మూలించడానికి, అంతేగాని నేనే స్వయంగా ఒక విగ్రహంగా మారి ప్రజలు నన్ను పూజించడానికి కాదు. నన్ను ఇతరులకంటే రవ్వంతైనా గొప్పగా నేను భావించనని అల్లాహ్ తఆలాకు బాగా తెలుసు. నా దృష్టిలో అహంకారి కంటే పెద్ద విగ్రహారాధకుడు మరొకడు లేడు. హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ గారు తరచూ ఇలా అనేవారు. 'మా నాన్నగారు తన జీవితాన్ని ఒక రాజులా (మొఘల్ చక్రవర్తిలా) గడపలేదు, ఒక సామాన్య ఫకీరులా గడిపారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లన్నారు. నిష్టాపరత కలిగిన వారి కొరకు ఉన్న నిబంధన ఏమిటంటే వారు తమ జీవితాన్ని సరళత్వంలో, వినమ్రతలో గడపాలి. ఇది నిష్టాపరతలోని ఒక శాఖ. దీని ద్వారానే మనం అనుచితమైన కోపాన్ని జయించాల్సి ఉంటుంది. పెద్ద పెద్ద జ్ఞానులు, సత్యసంధుల ఆధ్యాత్మిక ప్రయాణంలో అత్యంత కఠినమైన చివరి ఘట్టం కోపం నుండి తమను తాము కాపాడుకోవడమే. అహంకారం, గర్వం అనేవి కోపం నుండి పుడతాయి. అలాగే కొన్నిసార్లు కోపం కూడా అహంకారం, గర్వాల ఫలితంగానే వస్తుంది. ఎందుకంటే మనిషి తనను తాను ఇతరులకంటే గొప్పగా భావించుకున్నప్పుడే కోపం కలుగుతుంది. నా సంఘంలోని వారు ఒకరినొకరు హెచ్చుతగ్గులుగా భావించుకోవడాన్ని, ఒకరిపై ఒకరు గర్వాన్ని ప్రదర్శించడాన్ని లేదా ఒకరిని ఒకరు హీనచూపుతో చూడటాన్ని నేను అస్సలు ఇష్టపడను. నిజానికి ఎవరు గొప్పవారో, ఎవరు సామాన్యులో ఆ దేవుడికే బాగా తెలుసు. కొంతమంది మనుషులు పెద్దవారిని కలిసినప్పుడు ఎంతో గౌరవ మర్యాదలతో ప్రవర్తిస్తారు. కానీ అసలైన గొప్పవాడు ఎవరంటే ఒక పేదవాడి మాటను ఎంతో వినమ్రతతో ఆలకించేవాడు, అతనిని ఆదరించేవాడు, అతని మాటకు విలువనిచ్చేవాడు. అవతలి వ్యక్తికి బాధ కలిగించే విధంగా ఎగతాళి చేసే ఏ ఒక్క మాటను కూడా నోటి వెంట రానివ్వకూడదు. అల్లాహ్ తఆలా ఇలా ఉపదేశిస్తున్నాడు.

وَلَا تَنَابَزُوْا بِالْاَلْقَابِ بِئْسَ الِاسْمُ الْفُسُوْقُ بَعْدَ الْاِيْمَانِ وَمَنْ لَّمْ يَتُبْ فَاُولٰٓئِكَ هُمُ الظّٰلِمُوْنَ

(అల్ హుజురాత్:12) అనగా మీరు ఒకరినొకరు నిందించుకొనకుడు. ఒకరి నొకరు ఎగతాళి పేర్లతో పిలుచుకొనకుడు. ఎందుకనగా ఇది పాపాత్ములు, దుర్మార్గుల లక్షణం. ఎవరైతే ఇతరులను వెక్కిరిస్తారో, వారు స్వయంగా అదే స్థితిలో పడేవరకు వారికి మరణం సంభవించదు. కాబట్టి మీ సోదరులను తక్కువగా అంచనా వేయకండి, వారిని తృణీకరించకండి. మీరంతా ఒకే చెలిమ నుండి నీరు తాగుతున్నప్పుడు, ఎవరి భాగ్యంలో ఎక్కువ నీరు తాగాలని రాసి ఉందో ఎవరికి తెలుసు?

అల్లాహ్ తఆలా మనలో నిజమైన వినయ, వినమ్రతను పెంపొందించుకునే భాగ్యాన్ని ప్రసాదించుగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ లోకి ప్రవేశించి, మనం నిజమైన ఇస్లాం బోధనలపై నడుచుకునే వారిగా మరియు దాని హక్కును పూర్తిగా నెరవేర్చే వారిగా చేయుగాక! ఆమీన్.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔